క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని గరువురోడ్డు, లక్ష్మీ టాకీసు సెంటరు నుంచి బేతపూడి సెంటరు వరకు రహదారికి ఉత్తరం వైపున, జేఎల్‌బీ కళాశాల రోడ్డు, బేతపూడి గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

సైకిళ్ల వితరణ అభినందనీయం



కొల్లూరు : పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సౌకర్యం కోసం సైకిళ్ల వితరణ చేయడం అభినందనీయమని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. ఆదివారం మండలంలోని జువ్వలపాలెంలో అదే గ్రామానికి చెందిన వేములపల్లి రవికిరణ్ వీఆర్‌కే ట్రస్టు ద్వారా 275 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాలకు వెళ్లి ఆర్థికంగా స్థిరపడిన వ్యక్తులు సొంత గ్రామం అభివృద్ధికి, విద్యార్థులకు సహాయ, సహకారాలు అందించడం గర్వించదగిన విషయమన్నారు.

అమ్మవార్లకు సారె సమర్పణ




కర్లపాలెం: మండలంలోని చింతాయపాలెం తూర్పుపాలేనికి చెందిన పెదమల్లు వారి ఆడపడుచులు శ్రీ సారకాయలంకమ్మతో పాటు మరో 13 మంది దేవతామూర్తులకు నిండు సారెను ఆదివారం సమర్పించారు. తూర్పుపాలెంలోని సారకాయలంకమ్మ తల్లి, లక్ష్మీ తిరుపతమ్మ, సీతారామ మందిరం, గణపవరం ఊర్లమ్మ తల్లి, కర్లపాలెం పెద్దింటమ్మ తల్లి, కాళికమ్మతల్లి, చింతాయపాలెం వీర్లంకమ్మ తల్లి, రేణుక ఎల్లమ్మ తల్లికి సీతారామ మందిరాలలో పెదమల్లు వారి ఆడపడుచులు సారె సమర్పించారు. ఈ కార్యక్రమాలను పెదమల్లు రంగారావు మంగమ్మ దంపతులు, శేషాయమ్మ, సుజాత, రేణుక, అరుణ, భవాని, దుర్గ, శోభ తదితరులు పర్యవేక్షించారు.

వృద్ధులు, పేదలకు అన్నదానం



తెనాలిరూరల్: పట్టణానికి చెందిన రాష్ట్ర ఇమానె మజ్లిస్ యువజన కమిటీ ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు ఆదివారం అన్నదానం చేశారు. నరేంద్రదేవ్ కాలనీలోని పేదలకు ఆహారం అందించారు. షేక్ తాజ్ బాషా, షేక్ బాషా, షేక్ బుజ్జి, ధనాల రాఘవేంద్రరావు పాల్గొన్నారు. అలానే వెంకటేశ్వర యోగ సేవాకేంద్రానికి చెందిన కన్నెగంటి పిచ్చియ్య, సుశీలదేవి, నరేంద్రకుమార్, కీర్తి కుటుంబసభ్యుల సహకారంతో స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా శాంతి ఆశ్రమం, నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాలయాల్లో వృద్ధులకు అన్నదానం చేశారు. సరయు, శ్రేయస్, వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు పాల్గొన్నారు.


పిల్లలకు వైద్య పరీక్షలు



తెనాలి: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం పిల్లల ఉచిత వైద్య శిబిరం జరిగింది. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో న్యూ లైఫ్ చిల్డ్రన్ హాస్పిటల్ యాజమాన్యం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెనాలి ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు అచ్యుత సాంబశివరావు తెలిపారు. గత 19 ఏళ్లగా నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో చిన్నారులకు వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కుప్పా రాజశేఖర్ అన్నారు. ఆహార, ఎదుగుదల లోపాలు కారణంగా చిన్నారులు గుండె జబ్బులకు గురవుతారని ప్రముఖ చిన్నపిల్లల గుండె వైద్య నిపుణుడు డాక్టర్ పి.రఘురామ్ అన్నారు. డాక్టర్ కుప్పా రాధిక రాజశేఖర్, డాక్టర్ గారపాటి అఖిల్, డాక్టర్ కేటీఎస్ శ్రీనివాసరావు 200 మంది చిన్నారులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మాలేపాటి తిరుమలేశ్వరరావు, వి.శివ సుధాకర్, ఎం.హేమంత్ కుమార్, బి.రామ్మోహన రావు, జి రామకోటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఎం పూర్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

సామాన్యుడికి ధరాఘాతం

- పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలు
- పైపైకి కూరగాయలు, ఆకు కూరలు
- సంచి నిండా డబ్బులు జేబులోకి సరుకులు



ఉల్లిపాయలు



పామోలిన్ ప్యాకెట్లు



కందిపప్పు



టమాటాలు

పిట్టలవానిపాలెం : నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటి సామాన్యుడికి భారంగా మారాయి. మూడు పూటలా కడుపునిండా పట్టెడు మెతుకులు తిందామంటే నిత్యావసర సరుకుల ధరలకు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కూరగాయల ధరలతోపాటు నిత్యావసర వస్తువుల ధరలు తారాజువ్వల్లా ఆకాశం కేసి దూసుకుపోతూ పేదవాడి నడ్డివిరుస్తున్నాయి. ఆహారోత్పత్తులు అందుబాటులో లేవని సాకుగా చూపి వ్యాపారులు రోజురోజుకూ ధరలను పెంచేస్తున్నారు. దీంతో సగటు వినియోగదారుడు అన్నం, పప్పుకు బదులు గంజినీళ్లతో జీవించాల్సిన దుర్భర పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. కాలక్రమేణ చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో సగటు వినియోగదారుడి కొనుగోలు శక్తికి అనుగుణంగానే ధరలు భారీగా పెరుగుతున్నాయి.

రూ. 200కు చేరుకున్న కందిపప్పు

కందిపప్పు ధర రోజురోజుకి కొండెక్కుతోంది. ప్రస్తుత కిలో ధర రూ. 180 నుంచి రూ.200ల వరకు ఉంది. రానున్న రోజుల్లో రూ.300లకు చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదు. దీంతోపాటు మిగిలిన నిత్యావసర సరుకుల ధరల సైతం పెరిగిపోతున్నాయి. బహిరంగ మార్కెట్లో గతంలో రూ.65ల నుంచి రూ.70ల వరకు ఉన్న మినప్పప్పు ప్రస్తుతం కిలో రూ.180 నుంచి రూ. 200లకే చేరింది. ఇక నూనెలు సలసల కాగుతున్నాయి. శనగ నూనె కిలో రూ.150ల నుంచి రూ.200ల వరకు ఉంది. దీంతో మరింత భారం పడిందని మధ్య తరగతి ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ఘాటెక్కిన ఉల్లి ధరలు..

గతంలో వారం కిలో ఉల్లి రూ.30 ఉండగా.. నేడు రూ.60 గా ఉంది. ఉల్లి ధరలు వినియోగదారులను కంట తడి పెట్టిస్తున్నాయి. ఉల్లి ధరలు కొండెక్కి కూర్చున్నాయి. నెల రోజుల క్రితం వరకు రూ.20 ఉన్న ధర అమాంతం పెరిగింది. మహారాష్ట్ర నుంచి సరఫరా తగ్గిపోవడం కూడా ధర పెరుగుదలకు కారణమని తెలుస్తోంది. ఇక తమిళనాడు నుంచి వస్తే తప్ప ఆకాశం బాట పట్టిన ఉల్లి ధరలు దిగివచ్చేలా లేవు. ఐతే ఈ నెలాఖరుకు కాని అక్కడ పంట చేతికి రాదు. అప్పటి వరకు ధరలు తగ్గే సూచనలు లేవని వ్యాపారులు తెలిపారు. దైనందిన జీవితంలో ఉల్లికి ఉండే గిరాకీ అందరికీ తెలిసిందే. రోజువారీ వీటి వినియోగం లేని ఇల్లు ఉందంటే నమ్మక తప్పదు.

టమాటా అదే పరిస్థితి..

ఇక కూరగాయలలో టమాటా ధర కిల్తో రూ.70 నుంచి రూ.80కు చేరింది. ఏ రకం కూరగాయ కొందామన్నా ధరలు మండిపోతున్నాయని ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ధరల నియంత్రణకు తగిన చర్యలు తీసకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాగిరెడ్డి ఉద్యమాలు చిరస్మరణీయం



నాగిరెడ్డికి విప్లవ జోహార్లర్పిస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు

రేపల్లె రూరల్: పేదలు, రైతుల కోసం, సమాజంలో అసమానతలు తరిమివేయటం కోసం తరిమిల నాగిరెడ్డి చేసిన ఉద్యమాలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు మేకల ప్రసాద్ అన్నారు. తరిమెల నాగిరెడ్డి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని 13వ వార్డులో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. స్వాతంత్ర సమరంలో తన సేవలు అందించిన నాగిరెడ్డి తొలి నుంచి సామ్రాజ్యవాద విధానాలకు, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకులన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రపంచ బ్యాంక్, డబ్ల్యుటీవో, ఐఎంఎఫ్ విధానాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఈ విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని, సన్న, చిన్న కారు, కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని సామ్రాజ్యవాదుల దయాదాక్షిణ్యాలకు వదిలి వేయటం తగదన్నారు. నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలు దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐకేఎంఎస్ నాయకులు తలపల మల్లయ్య, పీవోడబ్ల్యూ రేపల్లె నాయకులు టి.శివనాగులు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు శివపార్వతి, సీహెచ్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

స్నేహ హస్తం



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

భట్టిప్రోలు: జీవితానికి తొలి మెట్టు చదువుల గుడి.. జీవితాన్ని గాఢంగా లోతుగా తరచి చూసుకునే కల్పించిన చోటును మరచిపోకుండా స్నేహితులు అందరూ కలసి ఉదారతను చాటుకున్నారు. అందరూ కలసి కట్టుగా ఉంటూ ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలవాలని నిర్ణయించుకున్న భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ 1988-1989 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ బ్యాచ్ విద్యార్థులు తమ బ్యాచ్‌లోని స్నేహితులు ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తోటి స్నేహితుడు నండూరి పరిశుద్ధరావుకు ఆదివారం కోడిపర్రు వెళ్లి రూ. 27,601లు నగదు అందించి అండగా నిలిచారు. గద్దె విజయరాజు, కొక్కిలిగడ్డ సారధి, గోవతోటి నాగయ్య, కోట తాండవకృష్ణ, గురిందపల్లి వసంతరావు, బొమ్మిశెట్టి మధు, నండూరి రమేష్, కేవీ నాగరాజన్, కె.చిదంబరరావు, ఎం. గోవిదరాజులు పాల్గొన్నారు.

వ్యవ'సాయం' తగ్గించడంపై నిరసన

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

తెనాలి: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపులు తగ్గించడాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహం ఎదుట జరిగిన నిరసనలో సీఐటీయూ జిల్లా నాయకుడు కొల్లిపర బాబూప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిహార్ రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించి, ఆంధ్రప్రదేశ్‌కు తీవ్రంగా అన్యాయం చేసిందని మండిపడ్డారు. వివిధ సంస్థల ద్వారా రూ.15 వేల కోట్లను అప్పుగా ఇస్తామని చెప్పటం అన్యాయమన్నారు. పోలవరం, రాజధాని నిర్మాణ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ దేశంలో నూటికి 70 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నట్లు చెప్పారు. ఎరువులపై సబ్సిడీలు తగ్గించటం వల్ల యూరియా, కాంప్లెక్స్ ఎరువుల ధరలు విపరీతంగా పెరుగుతాయని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.20 వేల కోట్లను తగ్గించినట్టు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని ఆరోపించారు. కార్మిక, కర్షక ఐక్యతతోనే వ్యవసాయ రంగాన్ని కాపాడుకోగలమని, రైతాంగాన్ని రక్షించుకోవటం సాధ్యపడుతుదని చెప్పారు. ఆ దిశగా కృషి జరగాల్సి ఉందన్నారు. సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలి, పి. జోనేష్, చుక్కపల్లి శేషగిరిరావు, మహిళా సంఘం నాయకులు ఎస్.రాజ్యలక్ష్మి, వై.ఈశ్వరి, చంద్రకళ, ములకా శివకుమారి, ఎం.అనూష పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ కె.మిథునేశ్వర్‌రెడ్డి

తెనాలి: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని సంఘ భవనంలో నిర్వహించారు. అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ కె.మిథునేశ్వర్‌రెడ్డి ప్రత్యేక ప్రసంగం చేశారు. ఊపిరితిత్తుల వ్యాధులపై సభ్యులకు అవగాహన కల్పించారు. మత్తు, నొప్పి నివారణ వైద్యురాలు డాక్టర్ ఎంపీ ప్రియాంక వివిధ రకాల నొప్పుల గురించి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా సమావేశానికి ముందు సంఘ సభ్యులకు ఊపిరితిత్తుల సామర్థ్యం పరీక్షలు నిర్వహించారు. కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు, సభ్యులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రత్తిపాడు: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎ.హరితాచౌదరి అన్నారు. వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి ప్రాథమిక పాఠశాలలో ఆదివారం గుంటూరు శ్రీ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 104 మంది రోగులు హాజరయ్యారు. వీరికి న్యూరాలజిస్ట్ డాక్టర్ ఆరెకపూడి హరితాచౌదరి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. తొలుత రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. శిబిరంలో డాక్టర్ శ్రీనివాసరావు, మేనేజర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కుంగ్ ఫూలో సత్తా చాటిన విద్యార్థి



భట్టిప్రోలు: భట్టిప్రోలు మాతా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో 7వ తరగతి చదువుచున్న కె.ప్రభాకర్ అండర్-15 విభాగంలో నేషనల్ కుంగ్ ఫూ టోర్నమెంట్‌లో సత్తా చాటి రజత పతకం సాధించాడు. ఆదివారం హైదరాబాద్‌లోని రెడ్డి జన సంఘం ఫంక్షన్ హాలులో నిర్వహించిన కుంగ్ ఫూ నేషనల్ టోర్నమెంట్ నిర్వాహకులు విశ్వేశ్వరరెడ్డి చేతుల మీదగా పతకం, సర్టిఫికెట్‌ను అందుకున్నాడు. ప్రభాకర్‌కు షావలిన్ కుంగ్ ఫూ మాస్టర్ కె.గోపి శిక్షణ ఇచ్చారు. ప్రతిభ చూపిన ప్రభాకర్‌ను భట్టిప్రోలు హైస్కూల్ ప్రిన్సిపల్ కె.ఎస్‌వీ రవితేజ, ఉపాధ్యాయులు అభినందించారు.

మహిళకు ఆర్థిక సాయం



తెనాలిరూరల్: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మహిళకు యోగ గురువు కేఎన్‌కే కిషోర్ గురూజీ ఆర్థిక సాయం అందించారు. పొన్నూరుకు చెందిన శైలజ కిడ్నీ సమస్యతో తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స తీసుకుంటోంది. విషయం తెలుసుకున్న కిషోర్ గురూజీ ఆదివారం వైద్యశాలకు వెళ్లి రూ.4,816లను బాధిత మహిళకు అందజేశారు. అలానే అహ్మదాబాద్‌లో ఉంటున్న విక్రమ్ సహకారంతో వార్డులోని రోగులకు బ్రెడ్‌లు పంపిణీ చేశారు.

షుగర్ వ్యాధి రోగులకు ఉచితంగా పరీక్షలు

తెనాలి: డీ3 శారద సర్వీస్ సొసైటీ, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం బుర్రిపాలెం రోడ్డులోని డాక్టర్ శారద భవనంలో ఉచిత మధుమేహ వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్నుంచి ప్రజలు ఉదయం ఆరు గంటలకే తరలివచ్చారు. వీరందరికి పరగడుపున షుగర్, బీపీ పరీక్షలు చేశారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. అల్పాహారం అందించి నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు (సంక్రమించని వ్యాధులు)పై డాక్టర్ శారద అవగాహన కల్పించారు. ఆహార, వ్యాయామ నియమాలను పాటిస్తే.. జీవితం ఆరోగ్యవంతంగా సాగుతుందని చెప్పారు. 200 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

కౌలు రైతు ఆత్మహత్య



శివయ్య (ఫైల్)

ప్రత్తిపాడు: అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని తూర్పుపాలెంకు చెందిన ధూపాటి శివయ్య (56) గత సంవత్సరం నాలుగు ఎకరాలు పొలం కౌలుకి తీసుకొని.. రెండు ఎకరాల్లో పత్తి, రెండు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేసాడు. పంట సరిగా పండకపోవడంతో దిగుబడులు ఆశించిన స్థాయిలో రాక నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. దీంతో రూ.4 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక మానసికంగా బాధపడుతున్నాడు. ఈ నెల 27వ తేదీ ఇంట్లో నోవాక్రాన్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన బంధువులు ప్రత్తిపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని భార్య ధూపాటి ముత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు తెలిపారు.

శాకంబరీదేవిగా పోలేరమ్మ



ప్రత్యేక అలంకరణలో అడెమ్మవారు



సామూహిక కుంకుమ పూజలో మహిళలు

వేమవరం(భట్టిప్రోలు): మండలంలోని సూరేపల్లి పంచాయతీ వేమవరంలో కొలువైన పోలేరమ్మ వారిని ఆదివారం శాకంబరి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా లలిత సహస్ర నామ, దేవి ఖడ్గ మాల సహిత లక్ష్మీ అష్టోత్తర శత నామ యుక్తంగా కుంకుమ, పుష్ప పూజను మహిళలు నిర్వహించారు. అర్చకులు ధారా నారాయణ మూర్తి కార్యక్రమాన్ని పర్యవేక్షించి, పూజా కార్యక్రమాలు శాస్త్రయుక్తంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అద్దేపల్లి గ్రామ కొంగు బంగారమైన అడెమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు సాంప్రదాయ బద్ధంగా ఆషాఢ మాస సారెను అందించారు. అర్చకులు అమ్మవారి చెంతన ఉంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో పూజలు జరిపారు. అలాగే గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సేవా భావంతో ముందుకు



మాట్లాడుతున్న మానవతా సంస్థ చైర్మన్ పావులూరి

బాపట్ల : సేవా భావంతో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థను ముందుకు తీసుకుపోతున్నామని ఆ సంస్థ గుంటూరు జిల్లా చైర్మన్ పావులూరి పేర్కొన్నారు. జంగారెడ్డి గూడెంలో 2004లో ప్రారంభించిన సంస్థ, బాపట్లలో ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆదివారం స్థానిక ఏకో హాస్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పావులూరి మాట్లాడుతూ సంస్థ 70 వేల మంది సభ్యులు, 110 శాఖలతో ఆంధ్రప్రదేశ్‌లో పని చేస్తుందన్నారు. శాంతి రథాలు, మార్చురీ బాక్సులు ఉచితంగా ఇవ్వడం వంటివి చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చిలుకూరి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్‌గా కె.సుబ్బారావు, సెక్రటరీగా ఎం.ప్రసన్నాంజనేయులు, జాయింట్ సెక్రెటరీగా కె.పద్మజ, కోశాధికారిగా సీహెచ్ కేశవులు, గవర్నింగ్ బాడీ డైరెక్టర్లుగా వాసుదేవరావు, ఎల్. వెంకట్రావు, నాగేశ్వరరావు ఎంపిక చేశారు. సభలో జె. వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ మీనా, బి.అనంత, నాగలక్ష్మీ, ప్రసన్న, సీహెచ్ లక్ష్మీ, దీపిక, అనురాధ, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగేశన.. సుడిగాలి పర్యటన

బండ్లమ్మ ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు విడుదల



ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

పిట్టలవానిపాలెం: పంట కాల్వల ఆధునీకరణ పనులను వచ్చే ఏడాది నిర్వహిస్తామని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. మండలంలోని ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం గ్రామాలలో పంట కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభమైనందున వచ్చే ఏడాది పనులు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం కాలువల్లోని తూటి కాడను తొలగించడంతో పాటు నీటి పారుదలకు అడ్డంకిగా ఉన్న కొద్దిపాటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఖాజీపాలెం నుంచి రామ్‌నగర్, ఏటికట్ట ప్రాంతాల్లోని పంట కాలువను పరిశీలించారు. అక్కడి నుంచి పిట్టలవానిపాలెం లాకుల వద్ద కాలువను పరిశీలించి స్థానిక నాయకులు, రైతులతో మాట్లాడారు. అనంతరం చందోలు శివారులోని బండ్లమ్మ ఎత్తిపోతల పథకం నుంచి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,200 ఎకరాలకు సాగు నీరందించేందుకు ఈ ఎత్తిపోతల పథకం నిర్మించడం జరిగిందని తెలిపారు. ఈ పథకం పరిధిలోని రైతులు ఐకమత్యంతో కలిసి పథకాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎత్తిపోతల పథకంకు 24 గంటలూ విద్యుత్ సౌకర్యం కల్పించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. ప్రభుత్వంతో చర్చించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఉచిత విద్యుత్‌ను అందించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, మాజీ అధ్యక్షుడు గోకరాజు శ్రీధర్‌వర్మ, పార్టీ నాయకులు మంతెన కృష్ణమూర్తి రాజు, సాంబమూర్తి రాజు, వెంకటపతిరాజు, డేవిడ్,దోమ నాగేశ్వరరెడ్డి, సాయిబాబారెడ్డి, వెంకటనారాయణ, కలకోట కిషోర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, వేగేశన కిషోర్‌కుమార్, ఎత్తిపోతల పథకం చైర్మన్ దాసరి శ్రీనివాసరావు, మాడసాని బాలాజి, సాలేహ తదితరులు ఉన్నారు.

సమాజంలో మానవత్వం పెంచడమే లక్ష్యం

మానవత సర్వ సభ్య సమావేశంలో చైర్మన్ డాక్టర్ కె.రామ్‌చంద్



మృందగ విద్వాంసుడు కేవీ రామకృష్ణకు సత్కారం



ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆర్థిక సాయం

తెనాలి: సమాజంలో మానవత్వం పెంపొందేలా చేయటమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని సంస్థ తెనాలి శాఖ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అన్నారు. దీనితోపాటు కష్టాల్లో ఉన్నవారి కన్నీరు తుడవటం, విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, విద్య, వైద్యం, పర్యావరణ సేవల నిర్వహణ ఆశయాలతో ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. మానవత సంస్థ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ లైబ్రరీ హాలులో జరిగింది. అధ్యక్షత వహించిన డాక్టర్ రామ్‌చంద్ మాట్లాడుతూ తెనాలి శాఖ ఆరంభించిన ఏడాదిలోనే, సమావేశాలకు హాజరవుతున్న సంభ్యుల సంఖ్య, వయోవృద్ధులకు ఆత్మీయ పలకరింపు అనే అంశాలు రాష్ట్ర శాఖ ప్రశంసలకు నోచుకున్నాయని గుర్తుచేశారు. సాధ్యమైనంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్చుకోవాల్సి ఉందన్నారు. సమాజ సేవాభిలాషులు మానవతతో చేరి, సంస్థ ఆశయసాధనలో భాగస్వాములు కావాలని కోరారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షుడు కటకం వెంకట ప్రసాద్, కార్యదర్శి పోపుల వెంకట్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను వివరించారు. సభ్యత్వ నమోదు జరుగుతున్నందున అందరూ రెన్యువల్ చేసుకుని కొత్త సభ్యుల చేరికను ప్రోత్సహించాలని కోరారు. పట్టణానికి చెందిన ఏ-గ్రేడ్ మృదంగ విద్వాంసుడు కేవీ రామకృష్ణను సమావేశంలో సత్కరించారు. స్వచ్ఛంద సేవాసంస్థలు కళాకారులను ఆదరించి, సత్కరించటం అరుదైన విషయమని, ఈ గౌరవం తనకు దక్కటం సంతోషంగా ఉందని రామకృష్ణ అన్నారు. పిల్లలమర్రి శ్రీనివాసరావు కుమార్తె వివాహం నిమిత్తం విజ్ఞాన్ విద్యాసంస్థల అధిపతి డాక్టర్ లావు రత్తయ్య సమకూర్చిన రూ.20 వేలు, మానవత సాయం రూ.10 వేలు కలిపి మొత్తం రూ.30 వేల నగదును సమావేశంలో అందజేశారు. కంప్యూటర్ సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థిని హిమబిందు హాస్టల్ ఖర్చుల నిమిత్తం సంస్థ కన్వీనర్ తన్నీరు శ్రీనివాసబాబు, వారి మిత్రులు సమకూర్చిన రూ.25 వేల చెక్కును అందజేశారు. సమావేశంలో కేవీ రామకృష్ణ మృదంగ లయ విన్యాసం సభ్యుల కరతాళధ్వనులను అందుకుంది. గౌరవ సలహాదారులు మొవ్వా సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పరిమి శ్రీనివాసు, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్యశాస్త్రి, మహిళా విభాగం అధ్యక్షురాలు కె.కళ్యాణి, ముత్తేవి రవీంద్రనాథ్, చిట్టినేని సాంబశివరావు, ఎం.అర్జున, అయినాల మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఎం.ధనుంజయరావు, వి.ఫణీంద్ర, పి.మల్లికార్జునరావు, యడవల్లి రోహిణి, ఎ.లక్ష్మి, కోసూరి మధుసూదనరావు పాల్గొన్నారు.